క్లుప్తంగా

'ఫీజు దోపిడీ అరికట్టాలి'

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీ అరికట్టాలని టీజేవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొట్టూరి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో ప్రణీతకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజు లవసూలుతో పాటు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం, టై, షూ తదితర సామగ్రి విక్రయిస్తున్న పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో నాయకులు నరేందర్ యాదవ్, సతీశ్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి మండలస్థాయి పోటీలు

బోథ్: తెలంగాణ రాష్ట్రంలో వివిధ క్రీడ పాఠశాలలో 4, 5వ తరగతుల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు మండలస్థాయి ఎంపిక పోటీలను ఈనెల 4న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు ఎంఈవో భూమారెడ్డి శుక్రవారం తెలిపారు. తొమ్మిది క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 77805 98860 సంప్రదించాలన్నారు.

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ క్రీడ పాఠశాలల్లో 4, 5 తరగతుల్లో విద్యార్థుల ప్రవేశానికి జూలై 3న నేరడిగొండ ఉన్నత పాఠశాలలో తొమ్మిది క్రీడాంశాల్లో మండలస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో భూమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 9 సంవత్సరాలు గల విద్యార్థులు నాల్గో తరగతికి, అదేవిధంగా 9 సంవత్సరాలు గల విద్యార్థులు ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్ రూరల్: విద్యుత్ శాఖలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఉట్నూర్‌కు చేరుకున్నారు. ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికి, సన్మానించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం వెంకటేశ్వర్లు, అనంతయ్య, లక్ష్మయ్య, సుభాష్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

జైనథ్: మండలంలోని బెల్గాం వద్ద జాతీయ రహదారి మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామస్తులు, నాయకులతో కలిసి ఎస్సై పెర్సిస్ బిట్లకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బెల్గాం బ్రిడ్జి సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు, అఖిల్, చంద్రకాంత్, శంకర్, బాపురావు ఉన్నారు.

దాడులు జరగకుండా చూడాలి

ఉట్నూర్ రూరల్: భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌పై దాడులు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు జగ్జీవన్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లోని దేవ్‌బంద్‌లో మతోన్మాద శక్తులు ఆయనపై కాల్పులు జరిపారని మండిపడ్డారు. ఇలాంటి ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాంబ్లే ప్రజ్ఞశీల్, ప్రవీణ్, స్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్: గ్రూప్–4 పరీక్ష నేపథ్యంలో అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ప్రకటన పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్న పరీక్ష సమయాలకు అనుగుణంగా సర్వీసులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లపై కేసు

ఇంద్రవెల్లి: ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 01 జెడ్ 0010 గల ఆర్టీసీ బస్ ప్రయాణికులతో ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న సమయంలో ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద రోడ్డుపై ఆటో ఆగి ఉండడంతో బస్ డ్రైవర్ పవార్ రమేశ్ పక్కకు తీయాలని చెప్పాడు. డ్రైవర్ రాహుల్ ఆటో తీస్తుండగా.. ఇంకో ఆటో డ్రైవర్ పవార్ బాలకృష్ణ వచ్చి బస్ డ్రైవర్‌ను బూతులు తిడుతూ.. దాడి చేశాడు. బస్ డ్రైవర్ రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ బాలకృష్ణ, చోపాడే రాహుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితులను ఉరితీయాలి

ఇచ్చోడ: గిరిజన మహిళపై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను వెంటనే ఉరి తీయాలని దుబార్‌పేట్ యువజన సంఘం నాయకుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వెడమ రాము విగ్రహం నుంచి కుమురం భీం విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రోజురోజుకూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కొలువులు

- కాంట్రాక్ట్ పద్ధతిన 62 పోస్టులు
- ఈనెల 5 వరకు దరఖాస్తుకు గడువు
- 24 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష



కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం విద్య శాఖ చర్యలు చేపట్టింది. కాంట్రాక్ట్ పద్ధతిన ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. దీంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. ప్రత్యేకాధికారులు, పీజీ సీఆర్టీ, సీఆర్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. దీనికి సంబంధించి జిల్లా విద్యశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. నియామకాల కోసం ఈనెల 5 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుకు గడువు ఉంది. జిల్లాలోని ఆయా కేజీబీవీల్లో 62 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పరీక్ష ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నారు. కేజీబీవీ పోస్టులకు కేవలం మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఖాళీల వివరాలను https//schooledu.telangana. gov. in వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

ఆన్‌లైన్‌లో పరీక్ష..

తాత్కాలిక పద్ధతిన భర్తీ అయ్యే ఈపోస్టుల కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈనెల 24, 25, 26 తేదీల్లో పరీక్ష జరగనుంది. 24న యూఆర్ఎస్ ప్రత్యేక అధికారి పోస్టుకు ఉదయం 8.30 నుంచి 11.10 గంటల వరకు, కేజీబీవీ ప్రత్యేకాధికారి పోస్టుకు మధ్యాహ్నం 12.30 నుంచి 3.10 గంటల వరకు పరీక్ష జరగనుంది. 25న పీజీ సీఆర్టీ ఇంగ్లిష్, గణితం, నర్సింగ్, తెలుగు, ఉర్దూ పరీక్ష ఉదయం 8.30 గంటల నుంచి 11.10 గంటల వరకు జరగనుంది. అదేవిధంగా 25న మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3.10 గంటల వరకు పీజీ సీఆర్టీ, బాటనీ, కెమిస్ట్రి, సివిక్స్, కామర్స్, ఎకనావిక్స్, ఫిజిక్స్, జువాలజి పరీక్ష జరగనుంది. అదే రోజు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.10 గంటల వరకు సీఆర్టీ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణితం పరీక్ష నిర్వహించనున్నారు. 26న ఉదయం 8.30 నుంచి 11.10 గంటల వరకు సీఆర్టీ ఫిజికల్ సైన్స్, సాంఘిక శాస్త్రం, బయో సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, మధ్యాహ్నం 12.30 నుంచి 3.10 గంటల వరకు సీఆర్టీ తెలుగు, ఇంగ్లిష్, గణితం పరీక్షలు జరుగుతాయి. అదేరోజు సాయంత్రం 4.30 నుంచి 7.10 గంటల వరకు సైన్స్, సాంఘిక శాస్త్రం పరీక్షలు నిర్వహించబడతాయని విద్య శాఖ అధికారులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి



కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం తాత్కాలిక పద్ధతిన నియామకాలు చేపట్టడం జరుగుతుంది. కేజీబీవీల్లో 60 పోస్టులు, యూఆర్ఎస్‌లో 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈనెల 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉంది. 24, 25, 26 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తాం.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

పోస్టుల వివరాలు..

పోస్టు	ఖాళీలు				
సీఆర్టీ హిందీ	01	పీజీ సీఆర్టీ ఇంగ్లీష్	10	పీజీ సీఆర్టీ ఫిజిక్స్	05
సీఆర్టీ ఇంగ్లీష్	01	పీజీ సీఆర్టీ గణితం	03	పీజీ సీఆర్టీ జువాలజీ	05
సీఆర్టీ గణితం	01	పీజీ సీఆర్టీ నర్సింగ్	03	స్పెషల్ ఆఫీసర్	02
సీఆర్టీ ఫిజికల్ సైన్స్	02	పీజీ సీఆర్టీ తెలుగు	07	మొత్తం	60
సీఆర్టీ సాంఘిక శాస్త్రం	01	పీజీ సీఆర్టీ బాటనీ	05	**యూఆర్ఎస్‌లో..**	
సీఆర్టీ తెలుగు	01	పీజీ సీఆర్టీ కెమిస్ట్రి	06	సీఆర్టీ తెలుగు	01
		పీజీ సీఆర్టీ సివిక్స్	03	సీఆర్టీ సైన్స్	01
		పీజీ సీఆర్టీ కామర్స్	02	మొత్తం	02
		పీజీ సీఆర్టీ ఎకనామిక్స్	02		

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో మురుగునీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వందశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించారు. తొలుత పల్లె ప్రకృతి వనం, నర్సరీ, శ్మశానవాటిక, వర్మి కంపోస్టు షెడ్లను పరిశీలించారు. నర్సరీ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కడి చెత్త అక్కడ ఉండడంపై ఎంపీడీవో రమేశ్, ఏపీవో సురేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఏకలవ్య గురుకుల, జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీ లించారు. విద్యార్థుల హాజరు వివరాలను ప్రి న్సిపాల్, ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. హాజరుశాతం పెంచేలా చ ర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీ పాఠశాల స మీపంలో మురుగునీరు నిలువ ఉండడంపై పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చే శారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సీజన ల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్, ఆర్ఐ కవిత, ఎంఈవో తదితరులు ఉన్నారు.

కలెక్టర్ పేరిట ఫేస్‌బుక్ అకౌంట్ ప్రారంభం

కైలాస్‌నగర్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు, ఈవీఎంల నిర్వహణ వంటి ఎన్నికలకు సంబంధించి న ఇతరత్రా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించేలా జిల్లా యంత్రాంగం కొత్తగా అధికారికంగా ఫేస్‌బుక్ అకౌంట్ తెరిచారు. collectoradb Adb పేరిట ఏర్పాటు చేసిన దీనిని కలెక్టర్ రాహుల్‌రాజ్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ప్రారంభించారు. సోషల్ మీడియా ద్వారా ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ అకౌంట్ తెరిచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నలందప్రియా, ఈడీఎం రవి పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే విఫలం'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే జోగు రామన్న విఫమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని వికలాంగుల కాలనీ, విద్యానగర్ కాలనీల్లో పర్యటించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక కాలనీల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని, అయినా.. వాటి పరిష్కరంపై ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టి సారించడం లేదన్నారు. కార్యక్రమంలో అంకత్ రమేశ్, ఆదినాథ్, జోగు రవి, దినేష్ మటోలియా, చిలుకూరి జ్యోతిరెడ్డి, ఆకుల ప్రవీణ్, ధోని జ్యోతి పాల్గొన్నారు.

గిరిజన సంఘం నాయకుల అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో గిరిజన సంఘం నాయకులు

నేరడిగొండ: సీఎం సభకు ఆటంకం కలగకుండా గిరిజన సంఘం నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గిరిజన లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ మాట్లాడుతూ.. లైవ్ ఇన్‌చార్జి పాండు, సభ్యులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఎంత వరకు సమంజసమన్నారు. గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకొని ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

ఇచ్చోడ: సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని టీడీపీ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆత్రం జ్ఞానసుధ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. సీఎం పర్యటన సందర్భంగా టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గుళపల్లి ఆనంద్‌ను అరెస్టు చేయడం సరికాదన్నారు.

'రానున్న ఎన్నికల్లో బీజేపీదే అధికారం'



ప్రచారం చేస్తున్న సాకటి దశరథ్

తాంసి: రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, తాంసి(కె), గొల్లఘాట్, నిపాని గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ అబద్దపు హామీలతో గద్దెనెక్కి హామీలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జజ్జురి రాకేశ్‌యాదవ్, అంకం అశోక్, దేవారెడ్డి, రమేశ్, రామారావు, నర్సింగ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

బోథ్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని అల్పకాలిక విస్తారక్ వంగవీటి శ్రీనివాస్, రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్‌లు అన్నారు. శుక్రవారం పార్డి (కె), పార్డి (బి), కేశవ్‌గూడ, సొనాల, చింతల్‌బోరి, ఘన్‌పూర్ శక్తికేంద్రాల్లో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుభాష్ సూర్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేశ్, సోషల్ మీడియా కన్వీనర్ రవీందర్, రంజిత్‌సింగ్, రవితేజ, సోలంకి శ్రీకాంత్, ఓస సాయికుమార్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి'

ఆదిలాబాద్‌రూరల్: మోసపూరిత వాగ్దానాలు చేసి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ కుటుంబ పాలనకు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగారెడ్డి అన్నారు. శుక్రవారం మావల మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం పథకాలపై ప్రచారం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం వేలకోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిరెడ్డి, సంతోశ్‌యాదవ్, లక్ష్మణ్, భూమేష్, సూర్యకాంత్, మురళి, శ్రీకాంత్, నరేశ్, గంగన్న పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు ప్రారంభిస్తాం



చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమాండెంట్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామ శివారులోని రెండో పోలీస్ బెటాలియన్‌లో సుందరీకరణ పనులు ప్రారంభిస్తామని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే జోగు రామన్న బెటాలియన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనగా అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇవ్వడంతో శుక్రవారం చైర్మన్ పర్యటించారు. బెటాలియన్ కమాండెంట్ వేణుగోపాల్, ఎంపీపీ గండ్రత్ రమేశ్, సర్పంచ్ గంగారాం పాల్గొన్నారు.

సొనాల మండల ఏర్పాటుపై సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న గ్రామస్తులు

బోథ్: ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించిన సీఎం కేసీఆర్‌కు ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎంపీ నగేశ్, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్‌లు సొనాలతో పాటు భోరజ్, సాత్నాల మండలాల ఏర్పాటుకు విన్నవించారు. కాగా సీఎం మండలాల ఏర్పాటుకు సానుకూలంగా స్పందించి, వెంటనే చీఫ్ సెక్రటరీకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సొనాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో స్వీట్లు పంచిపెట్టారు. మాట ఇచ్చిన ప్రకారం సొనాలను మండలంగా ఏర్పాటు చేస్తున్నందున సీఎంకు ఎంపీపీ తుల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ మంత్రి గొడం నగేశ్ పాత్ర..

గత ఎన్నికల ప్రచారంలో ఆదిలాబాద్‌కు వచ్చిన సీఎం కేసీఆర్‌కు అప్పటి ఎంపీగా ఉన్న నగేశ్ ఓ చిట్టి మీద సొనాలను మండలంగా ప్రకటించాలని సీఎంకు రాసిచ్చారు. దీంతో కేసీఆర్ సొనాలతో పాటు సాత్నాలను మండలంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి మండల ఏర్పాటు కోసం గ్రామస్తులు పట్టుబట్టారు. ఆసిఫాబాద్‌లో పర్యటించిన సీఎం కేసీఆర్‌కు ఆదిలాబాద్ ఎమ్మెల్యే రామన్నతో కలిసి మాజీ ఎంపీ నగేశ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సీఎం స్పందించి ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

పోడు పట్టాల పంపిణీపై హర్షం

బోథ్: ఆసిఫాబాద్‌లో గిరిజనులకు సీఎం కేసీఆర్ పోడు భూముల పట్టాలు పంపిణీ చేయడంతో ఆదివాసీలు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని సొనాల గ్రామంలో ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న ఆదివాసీలకు స్వీట్లు పంచిపెట్టారు. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాయిసెంటర్ పెద్దలు ఆత్రం గంగాధర్, పురుషోత్తం, దేవరావ్, లక్ష్మణ్, కోసురావ్, పురుషోత్తం పటేల్, సీతారాం, దేవాలు పాల్గొన్నారు.

గ్రూప్–4కు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ధర్మారాణి

బోథ్: గ్రూప్–4 పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బోథ్ మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాగ్దేవి కళాశాల, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద గల సెయింట్ జోసెఫ్ పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీఎల్‌పీవో ధర్మారాణి శుక్రవారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వీరి వెంట ఎంపీవో జీవన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్: గ్రూప్–4 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డిపార్ట్‌మెంట్ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్ ముచ్చ స్వామి, ఇన్విజిలేటర్లతో సమీక్షించారు. అభ్యర్థులను చెక్ చేసిన తర్వాతే పరీక్ష గదిలోకి అనుమతించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కైలాస్‌నగర్: జిల్లా, మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలో గల 'చైల్డ్ హెల్ప్ లైన్'లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటనలో తెలిపారు. కేసు వర్కర్ 3 పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 7లోగా జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన తుల అరుణ్

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ మండలానికి చెందిన తుల అరుణ్ శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే మర్యాద పూర్వకంగా కలిశారు. తన తండ్రి తుల సుభాష్ పీసీసీ మాజీ కార్యదర్శిగా, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్‌గా పనిచేసినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తన తండ్రి పేరిట సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



నీటిని తీసుకొస్తున్న మహిళలు

తాంసి: వర్షాలు సమృద్ధిగా కురవాలని మహిళలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గంగానది నీటితో జలాభిషేకం నిర్వహించారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో శుక్రవారం మహిళలు ఊరేగింపుగా భక్తిగీతాలు ఆలపిస్తూ ఆలయాలకు చేరుకున్నారు. పోచ్చమ్మ, సర్గమ్మ, దుర్గామాత ఆలయాల్లో దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం చేశారు.

సాయిచంద్‌కు ఘన నివాళి

ఆదిలాబాద్‌రూరల్: పూలమాల వేసిమాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. మాల సంఘం జిల్లా అధ్యక్షుడు భూమన్న మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో సాయిచంద్ ఉద్యమకారుడిగా, గాయకుడిగా వందలాది సభల్లో పాల్గొని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. ఆయన గుండెపోటుతో మరణించడం తీరని లోటన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాసరి బాబన్న, సూర్య వరప్రసాద్, వెంకటస్వామి, ప్రశాంత్, కిరణ్‌కుమార్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పిచ్చి మొక్కల తొలగింపు

బోథ్: మండల కేంద్రంలోని 12వ వార్డులో గత కొన్నేళ్లుగా పిచ్చి మొక్కలు పేరిగాయి. దీంతో శుక్రవారం సర్పంచ్ సురేందర్ పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగించారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలు హామీ ఇచ్చారు. వార్డు సభ్యులు వెంకటేశ్, కాలనీవాసులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి

బోథ్: బోథ్ నుండి నిగిని గ్రామానికి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని మర్లపెల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ రాము కోరారు. శుక్రవారం రోడ్డు నిర్మాణం చేపడుతున్న సిబ్బందిని కలిశారు. మీకు దండం పెడుతున్నా.. రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరారు. రోగులు, వృద్ధులు, చిన్నపిల్లలు ప్రయాణం చేయడం నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తాంసి: భీంపూర్ మండలంలోని కొజ్జన్‌గూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. గ్రామానికి చెందిన చిరుద్యోగి శ్రీరాములు పాఠశాల పిల్లలకు తనవంతు సాయంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ్, పాఠశాల చైర్మన్ పెందూర్ బండు, ఉపాధ్యాయులు రత్నం, ఈశ్వర్ పాల్గొన్నారు.

నేడు బోథ్ ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు శనివారం మండలం పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని సవర్గావ్ గ్రామంలో ఉదయం 11 గంటలకు ఫర్టిలైజర్ షాపు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నాయకులు హాజరు కావాలని కోరారు.

3న ఉపాధిహామీ ప్రజావేదిక

సిరికొండ: మండల కేంద్రంలో సోమవారం ఉపాధిహామీ పథకం రెండో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేశ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలంలోని అన్ని గ్రామాలు ప్రజలు పాల్గొనాలని కోరారు.

రైతుబంధు కోసం దరఖాస్తుల స్వీకరణ

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం పోడు వ్యవసాయం చేసుకోనే రైతులకు నూతనంగా పట్టాలను అందించింది. ఇందులో భాగంగా రైతుల వద్ద నుంచి శుక్రవారం రైతుబంధు దరఖాస్తులను వ్యవసాయాధికారులు స్వీకరించారు. పోడు పట్టాలు పొందిన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవోలు ప్రవీణ్, దీపక్ సూచించారు.